# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 18-11-2025 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- సమాజం, ప్రభుత్వ భాగస్వామ్యంతోనే సమర్థవంతమైన నీటి నిర్వహణ సాధ్యమవుతుందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.
- ఆంధ్రప్రదేశ్ లోని పుట్టపర్తిలో సత్యసాయి బాబా శతాబ్ది ఉత్సవాలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ రేపు హాజరుకానున్నారు.
- ఉగ్రవాదంపై ప్రపంచ దేశాలు జీరో టోలరెన్స్ విధానాన్ని అవలంభించాలని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ కోరారు.
- ఆంధ్రప్రదేశ్ లోని మారేడుమిల్లి అడవులలో ఈరోజు ఉదయం జరిగిన ఎన్ కౌంటర్ లో కీలక నేత మద్వి హిడ్మాతో సహా ఆరుగురు మావోయిస్టులు మరణించారు.

=====================

సమాజం, ప్రభుత్వ భాగస్వామ్యంతోనే సమర్థవంతమైన నీటి నిర్వహణ సాధ్యమవుతుందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వ్యాఖ్యానించారు. భారత్ లో నీటి యాజమాన్యం అత్యవసరమని.. ఎందుకంటే దేశంలో జనాభాతో పోల్చితే నీటి వనరులు తక్కువగా ఉన్నాయని వెల్లడించారు. న్యూఢిల్లీలో ఈరోజు 6వ జాతీయ నీటి అవార్డులు, జల్ సంచయ్- జన్ భాగీదారీ అవార్డులను రాష్ట్రపతి ప్రదానం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల స్థాయిలో నీటి సంరక్షణ, స్థిరమైన నిర్వహణకు ప్రాధాన్యతనివ్వాలని స్పష్టం చేశారు. నీటి వాడకాన్ని తగ్గించి, సంరక్షణను పెంచే వినూత్న విధానాలను అవలంభించాలని రైతులు, పారిశ్రామికవేత్తలకు సూచించారు. సర్క్యులర్ వాటర్ ఎకానమీ పునరావృత నీటి ఆర్థిక వ్యవస్థ ద్వారా పరిశ్రమలు నీటి వనరులని సమర్థవంతంగా వినియోగించుకోవచ్చునని రాష్ట్రపతి పేర్కొంటూ...

(వాయిస్ 27 సెకన్లు)

ఈ అవార్డుల ప్రధానోత్సవంలో కేంద్ర జల శక్తి శాఖా మంత్రి సి. ఆర్. పాటిల్, సహాయ మంత్రి వి. సోమన్న పాల్గొన్నారు. మొత్తం 10 విభాగాల్లో 46 మంది విజేతలకు రాష్ట్రపతి అవార్డులను ప్రదానం చేశారు. ఉత్తమ రాష్ట్రాల విభాగంలో మాహారాష్ట్ర తొలి స్థానంలో నిలిచింది.

= = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలలో రేపు పర్యటించనున్నారు. ముందుగా ఆంధ్రప్రదేశ్ చేరుకొని పుట్టపర్తిలోని భగవాన్ శ్రీ సత్యసాయి బాబా పవిత్ర మందిరాన్ని సందర్శిస్తారు. భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శతాబ్ది ఉత్సవాల్లో కూడా ప్రధానమంత్రి పాల్గొంటారు. సత్యసాయి బాబా స్మారక నాణాన్ని, స్టాంపులను ఈ సందర్భంగా విడుదల చేస్తారు. ఆ తరువాత ప్రధానమంత్రి తమిళనాడులోని కోయంబత్తూరుకు వెళ్లి దక్షిణ భారత సహజ వ్యవసాయ సదస్సును ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమంలో దేశ వ్యాప్తంగా 9 కోట్ల మంది రైతులకు 18 వేల కోట్ల రూపాయలకు పైగా విలువైన PM-KISAN 21వ విడత నిధులను విడుదల చేస్తారు. అనంతరం ప్రధానమంత్రి సభను ఉద్దేశించి ప్రసంగిస్తారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

ఉగ్రవాదంపై ప్రపంచ దేశాలు జీరో టోలరెన్స్ విధానాన్ని అవలంభించాలని భారత విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ కోరారు. రష్యాలోని మాస్కోలో ఈరోజు జరిగిన షాంఘై కో-ఆపరేషన్ ఆర్గనైజేషన్ (SCO) ప్రభుత్వాధినేతల మండలి సమావేశంలో జైశంకర్ మాట్లాడుతూ... వాతావరణ మార్పులు, కోవిడ్ మహమ్మారి వంటి అనేక పరస్పర సంఘర్షణలు చోటు చేసుకున్న ఈ యుగంలో మానవతా సహకారం చాలా కీలకమని అన్నారు. ఆగ్నేయాసియాలో వారసత్వ పరిరక్షణకు సంబంధించి భారతదేశం తన గణనీయమైన అనుభవాన్ని మధ్య ఆసియాకు విస్తరించడానికి సిద్ధంగా ఉందని చెప్పారు. ఇటీవల సంవత్సరాలలో ఉగ్రవాదం, వేర్పాటు వాదం, తీవ్రవాదం మరింత తీవ్రమయ్యాయని.. ఈ బెదిరింపులను సమర్థించడం, కప్పిపుచ్చడం సాధ్యం కాదని జైశంకర్ స్పష్టం చేస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకం (పీఎల్ఐ) పథకంలో భాగంగా మూడో విడతలో 17 నూతన దరఖాస్తులకు కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయం పెట్టుబడులను మరింత ప్రోత్సహించడంతో పాటూ దేశీయ తయారీ రంగానికి ఊతమిస్తుందని మంత్రిత్వ శాఖ పేర్కొంది. చేనేత వస్త్రాలతో పాటు సాంకేతిక వస్త్ర రంగాల్లో ప్రపంచ దేశాలతో భారత్ పోటీని ఈ నిర్ణయం బలోపేతం చేస్తుందని వెల్లడించింది. కొత్తగా ఆమోదం లభించిన సంస్థలు 2 వేల 374 కోట్ల రూపాయల మేర పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమవుతున్నాయని తెలియజేసింది. చేనేత దుస్తులు, వస్త్రాలతో పాటు సాంకేతిక వస్త్ర ఉత్పత్తుల తయారీని ప్రోత్సహించడానికి 10 వేల 683 కోట్ల రూపాయలతో 2021 సెప్టెంబర్ 24న పీఎల్ఐ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. గత రెండు విడతల్లో కలిపి మొత్తం 74 దరఖాస్తులకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని జౌళి మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = =

భారత్, అమెరికా దేశాల మధ్య భాగస్వామ్యం వ్యూహాత్మక, ఆర్థిక రంగాలలో విస్తరిస్తోందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖా మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన ఇండో అమెరికన్ చాంబర్ ఆఫ్ కామర్స్ సదస్సుని ఉద్దేశించి ప్రసంగించిన మంత్రి, ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధం గురించి ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రెండు దేశాల మధ్య స్నేహం ఉమ్మడి అభివృద్ధి అనే దృక్పథంపై ఆధారపడి

ఉందని పునరుద్ఘాటించారు. ద్వైపాక్షిక చర్చలు నిరంతర ప్రక్రియ అని రైతులు, మత్స్యకారులు, చిన్న పరిశ్రమల ప్రయోజనాలను సమతుల్యం చేసుకుంటూనే భారత్ ఈ చర్చలు కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఇక వికసిత్ భారత్ దార్శనికతను సాకారం చేసేందుకు మిలీనియల్ తరాన్ని నైపుణ్య శక్తిగా మార్చాల్సిన అవసరం ఉందని పీయూష్ గోయల్ పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

మావోయిస్టు వ్యతిరేక కార్యకలాపాలలో గణనీయమైన పురోగతి లభించింది. ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అడవులలో ఈరోజు తెల్లవారుజామున జరిగిన ఎన్ కౌంటర్‌లో కీలక నేత మద్వి హిడ్మాతో సహా ఆరుగురు మావోయిస్టులు మరణించారు. మావోయిస్టుల కదలికలపై అందిన విశ్వసనీయ నిఘా సమాచారం మేరకు కూంబింగ్ నిర్వహించగా ఈ ఎన్ కౌంటర్ జరిగిందని ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) హరీష్ కుమార్ గుప్తా చెప్పారు. సంఘటనా స్థలం నుండి AK-47 రైఫిల్స్, పేలుడు పదార్థాలు సహా ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. మారేడుమిల్లి ప్రాంతంలోనూ  ఎన్టీఆర్, కాకినాడ జిల్లాల్లోనూ భద్రతా దళాలు గాలింపు కార్యకలాపాలను ముమ్మరం చేశాయి. కొనసాగుతున్న మావోయిస్టు వ్యతిరేక కార్యకలాపాల ఒత్తిడితో విజయవాడ నగరంలో ఆశ్రయం పొందుతున్న 27 మంది అనుమానిత మావోయిస్టులను పోలీసులు అరెస్టు చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ పరిధిలోని భారత భూవిజ్ఞాన అధ్యయన సంస్థ (జీఎస్ఐ) ఈ నెల 20, 21 తేదీల్లో జైపూర్‌లోని రాజస్థాన్ ఇంటర్నేషనల్ సెంటర్ లో 'గతాన్ని తవ్వితీద్దాం... భవిష్యత్‌కు బాటలు వేద్దాం' : 175 ఏళ్ల జీఎస్ఐ ఇతివృత్తంగా అంతర్జాతీయ సదస్సును నిర్వహిస్తోంది. దేశానికి 175 ఏళ్లుగా అందిస్తున్న 'జీఎస్ఐ' సేవలను గుర్తు చేసుకుంటూ ఏడాది పాటు నిర్వహించే ఈ కార్యక్రమాన్ని కేంద్ర బొగ్గు-గనుల శాఖా మంత్రి జి. కిషన్ రెడ్డి ప్రారంభిస్తారు. 1851లో ఏర్పాటైన జీఎస్ఐ భౌగోళిక మ్యాపింగ్, ఖనిజాన్వేషణ, కీలక-వ్యూహాత్మక ఖనిజాల గుర్తింపు, భౌగోళిక ప్రమాద అధ్యయనాలు, దేశాభివృద్ధి దిశగా భౌగోళిక శాస్త్రీయ పరిశోధనలను కొనసాగించడంలో కీలక పాత్ర పోషించింది. ఈ నేపథ్యంలో నిర్వహిస్తున్న ఈ  అంతర్జాతీయ సదస్సులో భారత్ సహా వివిధ దేశాల నుంచి నిపుణులందరూ ఒకే వేదికపైకి రానున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 84 వేల 950 పాయింట్ల వద్ద స్వల్ప లాభాల్లో ప్రారంభమై.. చివరకు  277 పాయింట్లు నష్టపోయి 84 వేల 673 వద్ద స్థిరపడింది.

= = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = =